ప్రజాశక్తి
గురువారం 13 నవంబర్ 2025
5

శ్రీ సత్యసాయి

ఢిల్లీ బాంబు పేలుళ్లకు నిరసనగా శాంతిర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు దాడిని నిరసిస్తూ బుధవారం పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో విద్యార్థులు శాంతి ర్యాలీ నిర్వహించారు. చిన్న మార్కెట్ పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ సర్కిల్ లో జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ మానవహారంగా ఏర్పడి ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, బాలయ్య పీఏ డాక్టర్ సురేంద్ర, టిడిపి నాయకులు నాగరాజు, వెంకటేష్, అమర్నాథ్, దుర్గా నవీన్, నాగేంద్ర, శివ, కౌన్సిలర్ రాఘవేంద్ర కుమార్, మురళి, అమన్ తో పాటు పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయండి

పేదలందరికీ ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి

సిపిఎం జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్

డిప్యూటీ తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన ఉత్తర్వులను అధికారులు అమలు చేసి, సిపిఎం కాలనీలో గుడిసెలను వేసుకున్న ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలను మంజూరు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. హిందూపురం పట్టణ సమీపంలోని సిపిఎం ఆధ్వర్యంలో కొల్లకుంట సమీపంలో సొంతిల్లు లేని నిరుపేదలు ఇంటి స్థలాలు కేటాయించాలని భూపోరాటం ద్వారా గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్థలాల్లో ఇళ్ల పట్టాలను మంజూరు చేయించాలని కోరుతూ వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలను చేయడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇంటి ముందు ఆందోళన చేసి బాలయ్య పిఎలకు సమస్యను వివరించారు. అయినప్పటికి సొంతిల్లు లేని వారికి అధికారులు ఇంటి పట్టాలను మంజూరు చేయలేదు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాల పోరాట కమిటీ వారు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో గౌరవ హైకోర్టు ఆశ్రయించారు. పరిశీలన చేసిన న్యాయస్థానం పేదలకు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని ఉత్వర్వులిచ్చింది. అయినప్పటికి అధికారుల్లో చలనం లేదు. దీంతో ఆగ్రహించిన పేదలు సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతు పట్టణంలోని అంబేద్కర్ నగర్, రహమత్ పురం, ఇందిరమ్మ కాలనీ, శాంతినగర్ తదితర ప్రాంతాలకు చెందిన నిలువ నీడలేని నిరుపేదలు వారి సొంతింటి కలను నెరవేర్చాలని కోరుతూ సచివాలయాలు, రెవిన్యూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతూ దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయినప్పటికీ ఏ ఒక్కరికి జానెడు ఇంటి స్థలాన్ని మాత్రం ప్రభుత్వం కేటాయించలేదన్నారు. ప్రభుత్వం కేటాయించకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో భూ పోరాటం చేసి కొల్లకుంట సమీపంలో ప్రభుత్వ భూమిలో దాదాపు 400 మంది వారి వద్ద ఉన్న బంగారాన్ని అమ్ముకుని, అది చాలక పోతే అప్పులు చేసి మరి గుడిసెలను వేసుకున్నారన్నారు. వేసుకున్న గుడిసెలకు పట్టాలు మంజూరు చేయాల్సిన అధికారులు అర్ధరాత్రి పూట పోలీసులను అడ్డుపెట్టుకుని అడ్డొచ్చిన మహిళలను అడ్డంగా తోసేసి గుడిసెలను కూల్చారని విమర్శించారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా పేదలు వారి సొంతింటి కలలు నెరవేర్చుకోవడానికి మరోసారి అదే స్థలంలోనే గుడిసెలను వేసుకోవడం జరిగిందన్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు హై కోర్టు ఉత్వర్వులను అధికారులు పాటించక పోవడంతో మరో సారి ఆందోళనకు సిద్ధం అయ్యామన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే వచ్చే మున్సిపల్ ఎన్నికలతో పాటు సాధరణ ఎన్నికల్లో తగిన బుద్ది చెబుతామన్నారు. అనంతరం హై కోర్టు ఉత్తర్వుల కాపీతో పాటు ఇంటి పట్టాలను మంజూరు చేయాలని కోరుతు వినతిని డిప్యూటి తహాసీల్దార్ ఆరతీకి వారు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు జ్యోతి, సరస్వతి, సునీత, అంజలి, నారాయణప్ప, నరసింహ, రామాంజనేయులు, పద్మక్క, రత్నమ్మ, శశికళ, గంగమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

కార్మికుల సమస్యల పరిష్కారంపై సిఐటియు ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగుతాయని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. బుధవారం నాడు పుట్టపర్తిలో సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు జెడ్డీ.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఓబులు విలేకరులతో మాట్లాడారు. సిఐటియు కార్మికుల పక్షాన కార్మికుల హక్కుల కోసం నిరంతరంగా పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తూ కార్పొరేట్ల ప్రయోజనాల కాపాడే పాలన చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గం అన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని అన్ని రంగాల కార్మిక, ఉద్యోగులందరికీ కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 29 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అఖిలభారత సిఐటియు మహాసభల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు, కోశాధికారి ఎన్.లక్ష్మీనారాయణ, శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్, అంగన్వాడీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిఎస్.శ్రీదేవి, వి.శ్రీదేవి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాబు, నరసింహమూర్తి, ముకుంద, ఓబులేసు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చెన్నకృష్ణమ్మ, కాంతమ్మ సిఐటియు ఆఫీస్ బేరర్స్ సాంబశివ, రాము, బాబ్జాన్, ముత్యాలు, పైపల్లి గంగాధర్, అయూబ్ ఖాన్, పెడబల్లి బాబా పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

జూడో పోటీల్లో చిగిచెర్ల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు కాకినాడ స్టేడియంలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ధర్మవరం మండలం చిగిచెర్ల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తిమ్మారెడ్డి, పీడీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా జూడో బాల, బాలికల విభాగంలో చిగిచెర్ల పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారన్నారు. యశ్వంత్, విక్రాంత్, నందిని, లాస్య రెడ్డిలు బంగారు పతకాలు సాధించారని తెలిపారు.

'ఉపాధి'కి ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి-గాండ్లపెంట

జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలు అందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈకేవైసీ 80 శాతం పూర్తయ్యిందని, మిగిలిన 20 శాతం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఆనంద్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ అంజినప్ప, గంగాద్రి, రవిచంద్ర రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగేష్, రమణప్ప, జయరాం, పరిమళ పాల్గొన్నారు.

ఉలవ బస్తాలు పంపిణీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

80 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తున్న ఉలవల బస్తాలను రైతులకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుల సమీపాన ఉన్న సిరికల్చర్ కార్యాలయంలో వీటిని అందించారు. 10 కేజీల ఉలవల బస్తాలు 112 రూపాయలకు అందజేశారు. రైతులు ఉలవలను ప్రత్యామ్నాయ పంటలుగా సాగు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని అందజేస్తోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్ దున్నీషా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రిషి విద్యాలయంలో చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని రిషి విద్యాలయ పాఠశాలలో చిత్రలేఖన పోటీలను థింక్ గ్యాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి థింక్ గ్యాస్ అసిస్టెంట్ మేనేజర్ రామ్ కిరణ్ విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులకు నిర్వహించిన పోటీలో వైస్ ప్రిన్సిపల్ కళ్యాణి, టీచర్లు ఉమాదేవి, రాధా, జోమిష, కుమారి బహుమతులు పొందారు. ప్రాథమిక విభాగంలో నాలుగవ తరగతి విద్యార్థులు శబ్ద ప్రథమ బహుమతి, సవిత్రూ ద్వితీయ బహుమతి, నితిన్ విజయ్, విభక్తి తతీయ, ప్రథమ బహుమతి సవిత్రూ ద్వితీయ, నితిన్ విజయ్ తతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఉన్నత విభాగంలో ప్రథమ బహుమతి తీక్షన్, ద్వితీయ బహుమతి తేజ ప్రకాష్ గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కరన్ స్వరూప సింగ్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ భాస్కర్, సిఇఒ రవీంద్ర, ఏవో రంగారెడ్డి పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జయరాం తెలిజేశారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమకారుల స్మరణ, 17న కవి సమ్మేళనం, రచయితలపై చర్చవేదిక, 18న పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీలు, 19న మహిళలకు రంగళ్లి, అల్లికలు ఇందిరాగాంధీ జయంతి, 20న డిజిటల్ గ్రంథాలయాలపైన అవగాహన, విలవ్ రీడింగ్‌తో వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి మంజునాథ్

విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకుని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పూలకుంట గ్రామ సర్పంచ్ మంజునాథ్, ఎస్‌డిజిఎస్ కళాశాల ప్రిన్సిపల్స్ నాగేంద్ర కుమార్, జె.ఎస్.వి.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. గత వారం రోజులుగా రూరల్ మండల పరిధిలోని పూలకుంటలో ఎస్ డి జి ఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచితో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవ మూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ రాజన్న, ఎన్సిసి లెఫ్ట్ నెంట్ ఫణీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ కుమార్, అధ్యాపకులు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలన్నింటినీ తొలగించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కొత్తచెరువు

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి

కొత్తచెరువు నాలుగు రోడ్ల కూడలిలో ఆక్రమణలన్నింటినీ తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కొత్తచెరువు ఆర్‌అండ్‌బి స్థలాల్లో ఆక్రమణలను వ్యవసాయ కార్మికసంఘం జిల్లాకార్యదర్శి వెంకటేశు తో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొత్తచెరువులో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపునకు అధికారులు శ్రీకారం చుట్టారన్నారు. తొలగింపులో పక్షపాత ధోరణి అవలంభిస్తూ కొందరివి మాత్రమే తొలగించి, మిగిలిన వారివి అలాగే ఉంచడం సరికాదన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో పంచాయితీ అధికారులు కొందరి ఆక్రమణలను చూసీచూడనట్లు వదిలేయడం సరికాదన్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలపై హైకోర్టులో వేసిన స్టేలను రద్దు చేయించి అన్నింటినీ తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెనుగొండ, ధర్మవరం రోడ్డు, మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న దుకాణాలను తొలగించి, మట్టి, రాళ్లను అక్కడే వేశారన్నారు. దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. పరిసర ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వాటిని శుభ్రం చేయాలన్నారు.

సొంతింటి కల సాకారమే లక్ష్యం : ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి అర్బన్

గృహ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలియజేశారు. బుధవారం నాడు మున్సిపాలిటీ పరిధిలోని కుటగుళ్లలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదల సొంతింటి కళను సాకారం చేసేలా అన్ని విధాలా సాయం అందిస్తున్నట్లు తెలియజేశారు. 2004 -2009 మధ్య కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలు జరిగాయన్నారు. ఈ విషయంపై గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథికి ఫిర్యాదు చేశామన్నారు. కదిరి ప్రాంతంలో గృహ నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల స్థలాల అంశంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నిరసనలో వైసిపి నాయకులు

వైసిపి నిరసన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీ కరణ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన నిరసనలో ముదిగుబ్బ నాయకులు పాల్గొన్నారు. ధర్మవరంలో కేతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీలో రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు ఇందుకూరు నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి,ధర్మవరం నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు జయమ్మ, సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు, వైస్ ప్రెసిడెంట్ చవ్వా లోకేశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు మీ సేవా చంద్ర,మండల యూత్ మనోహర్, లక్ష్మీదేవి, మీడియా వింగ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు కుర్చీల వితరణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు సన్ ఫీస్ట్ కంపెనీ ప్రతినిధి కె.సూర్య నారాయణ బుధవారం నాడు 15 కుర్చీలను వితరణ చేశారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.వనిత వాణికు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు బండి వేణుగోపాల్, అధ్యాపక సిబ్బంది సునీత, మునుస్వామి నాయుడు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధికదిగుబడి

ప్రజాశక్తి-కొత్తచెరువు

రైతులు యాజమాన్యం పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీరామునాయక్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తిరుమల దేవరపల్లి గ్రామ పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ రబీలో వేరుశనగ పంటను సాగు చేసే రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలని సూచించారు. 50 రోజుల వ్యవధిలో జిప్సం ఎకరాకు 200 కేజీలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఏఈఓ సునీత, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

కక్షసాధింపు కాదు..సంక్షేమ పాలన

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండలో గృహ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గత వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి మాదిరి కక్ష సాధింపు పాలన కాకుండా కూటమి ప్రభుత్వం ప్రస్తుతం సంక్షేమ పాలన చేస్తూ ముందుకు సాగుతోందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా గృహ ప్రవేశాల్లో భాగంగా పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్న సమయంలో పేదలకు ఇచ్చిన పక్కా ఇళ్లు, టిడ్కో గృహాలకు బిల్లులు ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అలాంటి పాలనను విడనాడి ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమాన్ని అందిస్తోందని తెలియజేశారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్లకు సైతం అదనంగా ఎస్సీ, ఎస్టీలకు రూ.75వేలు, బీసీలకు రూ.50 వేలును అందిస్తున్నట్లు తెలియజేశారు. మెడికల్ కాలేజీల అంశాన్ని వైసిపి కావాలనే రాద్ధాంతం చేస్తోందన్నారు. వారి ప్రభుత్వంలో మెడికల్ కళాశాలల ఏర్పాటుకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారన్నారు. జగన్మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీలపై విషం చిమ్మే ప్రయత్నాన్ని ఆపాలన్నారు. జగన్ చేసే అసత్య విమర్శలకు తాము బెదరం అన్నారు. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ 16 నెలల్లో అభివృద్ధి అంటే ఏమిటో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపించారన్నారు. సత్యసాయి జయంతోత్సవాలతో పుట్టపర్తి రూపురేఖలు మారిపోతున్నాయని తెలిపారు. పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి, సాతర్లపల్లి, అమగొండపాలెం, బొంతలపల్లి, కంబాలపర్తి, గ్రామాల్లో సెల్‌టవర్లను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, తెలుగుదేశం నాయకులు శ్రీరామ్ నాయక్, సింగల్ విండో అధ్యక్షులు విజయకుమార్, బిజెపి మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, పుల్లప్ప, వెంకటగారి పల్లి సర్పంచి లక్ష్మీదేవి ఓబులేసు, రాచువారి పల్లి నంబూరి సురేష్, పెడపల్లి శివప్ప, ఆకుల కుళ్లాయప్ప, బత్తలపల్లి మహేష్, శీను పాల్గొన్నారు.

పెనుకొండ : రాజకీయాలకతీతంగా, కక్షసాధింపులకు తావులేకుండా పేదల సొంతింటి కల నెరవేర్చడమే తమ బాధ్యతలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. పట్టణంలో 1500 కొత్త ఇళ్లు నిర్మించనున్నామని, ఇందులో భాగంగా 90 ఇళ్లకు భూమి పూజ చేసినట్లు వెల్లడించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో అర్బన్ కాలనీలో కుమ్మరి ఆనందమ్మ నూతన ఇంటి నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో ఇచ్చిన మరో హామీని కూటమి నెరవేర్చుతోందన్నారు. అందరికీ అవాసం పథకంలో భాగంగా రాష్ట్రంలోని సొంత ఇళ్లు లేని పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ... పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఒకేసారి 3,00,192 గృహ ప్రవేశాలు చేయిస్తున్నామన్నారు. ప్రస్తుతం పూర్తి చేసిన ఇళ్లతో పాటు త్వరలో మరిన్ని ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 8,086 ఇళ్లలో సామూహికగృహ ప్రవేశాలు చేస్తున్నట్లు వెల్లడించారు. పెనుకొండలో 147 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. త్వరలో మరో 3,947 ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. సొంత స్థలం ఉన్న ఇంటి నిర్మాణం కోసం ఈ నెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనందకుమార్, రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, కమిషనర్ సతీష్ కుమార్, తహశీల్దార్ స్వాతి, పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, రఘువీరా చౌదరి, త్రివేంద్ర, రాము, కష్ణమూర్తి, షౌకత్, దాదు,అరుణ్ రెడ్డి, ఎనుముల రామకష్ణ, రామలింగ, హౌసింగ్ అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం స్థానిక కార్మిక, కర్షక భవన్ లో నాగరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, ఉదయ్ భాస్కర్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హాజరయ్యారు. జిల్లాలోని స్టాక్ పాయింట్ల హమాలీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం ఏపీ సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఓబులు, అధ్యక్ష కార్యదర్శులుగా కోటీ, నాగరాజు, కోశాధికారిగా రామదాసుతో పాటు కమిటీ సభ్యులుగా ఫక్రుద్దీన్, కొండయ్య, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సూరి, నేల కోటప్ప, ఆంజనేయులు, గంగాధర్, శ్రీరాములు, వెంకటేష్, చెక్కలింగం, సుధాకర్, ఎన్. వెంకటేష్‌తో పాటు 17 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

సొంతిల్లు లేని నిరుపేదలు పక్క గృహాల మంజూరు కొరకు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల పరిధిలోని పెడపల్లిలో నిర్వహించిన గృహ ప్రవేశాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడపల్లి గ్రామంలో ఇల్లు పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేసుకుంటున్న లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పీఎంఏవై అర్బన్ 2.0 లో భాగంగా రూ. 2.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే పి ఎం ఏ వై గ్రామీణ ఆవాస్ 2024 యాప్ నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘంలో లబ్ధి పొందిన డ్వాక్రా మహిళ గువ్వలగుట్టపల్లి లక్ష్మితో కలెక్టర్ మాట్లాడుతూ సంఘం నుంచి పొందిన లబ్ధి కుటుంబ పోషణకు ఎలా ఉపయోగపడుతుందని ప్రశ్నించారు. అనంతరం పది సంవత్సరాల నుండి పెడపల్లి సమీపంలో గుడిసెలు వేసుకుని బతుకుతున్న కొంతమంది సంచార జాతులు తమ సమస్యను వివరించారు. తాము గ్రామంలో రేషన్ కార్డు ఓటర్ కార్డు ఆధార్ కార్డు పొందామని తమకు గతంలో ఇచ్చిన పక్కా గృహాలు రోడ్డు విస్తరణలో పోయాయని డబ్బులు ఇవ్వకుండా తిరిగి పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-గాండ్లపెంట

గాండ్లపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ కదిరి డిగ్రీ కళాశాలలో జరిగిన 39వ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పవిత్ర, హర్షిత, యశ్వంత్ జోయ్, ఫిరోజ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. డిసెంబర్ 1, 2వ తేదీల్లో నరసరావుపేటలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు పాపిడి ముంతాజ్ అలీ, శ్రీధర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, పీఈటీ మురారి షావలి తదితరులు అభినందించారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణానికి చెందిన పలువురు డ్వాక్రా సంఘాల సభ్యులు జనసేన పార్టీలో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో 36వ వార్డు కొత్తపేట, శాంతినగర్‌కు చెందిన మహిళలు జనసేన కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జనసేనలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-బుక్కపట్నం

విద్యారంగంలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం అయినదని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ అధ్యక్షులు ఓబిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సర్వశిక్ష అభియాన్ నూతనంగా నియమితులైన సెక్టోరియల్ అధికారులు హరి ప్రసాద్ సీఎంఓ, పుల్లన్న ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, వనిరాజ శర్మ తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఓబులేసు, కోశాధికారి ముకుంద, నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, రామ్మోహన్, ఎంఆనంద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొడవండ్లపల్లి విద్యార్థిని

ప్రజాశక్తి-ముదిగుబ్బ

అనంతపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో కొడవండ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అనన్య ఖోఖో అండర్-14లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శాంత లింగం, ప్రధానోపాధ్యాయులు రాశినేని రామానాయుడు ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

బాల్యవివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - చిలమత్తూరు

వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో బాల్యవివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, పిల్లల ఆరోగ్యం, విద్యపై పడే ప్రతికూల ప్రభావాలను గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి కౌన్సిలర్లు గీత, యామిని పాల్గొన్నారు.

విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-మడకశిర టౌన్

మడకశిర మండలం విలేజ్ రెవిన్యూ ఆఫీసర్ల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆమిదాల గొంది పంచాయితీ రంగనాథ్, ఉపాధ్యక్షులుగా జూలప్ప కార్యదర్శిగా రాజు, సహాయ కార్యదర్శిగా చరణ్ గౌడ్, కోశాధికారిగా యశోదను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ తహశీల్దార్ నరేష్, సహాయ ఎన్నికల అధికారిగా మురళి వ్యవహరించారు. ఆర్ఐ సోము శేఖర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE: DHARMAVARAM
O.S. No: 504/2022
Between:
Mangala Ramanjaneyulu ...Plaintiff
AND
M.Sankarappa and others ...Defendants
Notice to Defendant No: 6
D6: Mutyalamma W/o Sreeramulu D/o Mangala Anjinappa, Garimekalapalli Village, Ramagiri Mandal, Sri Satya Sai Dist.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 26-11-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
M.RAMANJANEYULU,
Advocate, Dharmavaram,
Cell:8639552234

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కదిరి వారి కోర్టులో
O.S. NO. 21/2023
Between:
బడా రవీంద్రనాథ్ రెడ్డి ...వాది
మరియు
గజాదిపల్లి ప్రభాకర్ రెడ్డి ...ప్రతివాది
ప్రతివాదికి నోటీసు
గజాదిపల్లి ప్రభాకర్ రెడ్డి, S/o జి. చంద్ర శేఖర్ రెడ్డి, వయస్సు 62సం...లు, హిందూ, DNo: 1-1135-8, రాముడు గుడి దగ్గర, అడపాల వీధి, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.
అయిన మీకు తెలియజేయడమేమనగా పై దావాలో మీ హాజరు నిమిత్తము 27-11-2025 వ పై తేదీన కోర్టులో వాయిదా కలదు. సదరు వాయిదా రోజున ఉదయం 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఏవైనా ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానీ యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియబరచడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:27/11/2025
స్థలం: కదిరి ఇట్లు
పఠాన్ జాఫర్ ఖాన్,
వాదితరపు వకీలు, కదిరి
సెల్:9440988774

వైద్య విద్యను దూరం చేసే కుట్ర

పిపిపికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో ఆందోళనలు

పెనుకొండలో వైసిపి నిరసన ప్రదర్శన

ధర్మవరంలో

ప్రజాశక్తి-పెనుకొండ, ధర్మవరం రూరల్ హిందూపురం, మడకశిర

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసే కుట్ర చేస్తోందని వైసిపి నాయకులు విమర్శించారు. వైద్య విద్య ప్రయివేటీకరణను నిరసిస్తూ ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో బుధవారం ఆందోళనలు నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పెనుకొండలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తూ కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో 10 కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయాలని నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. గత ఏడాది 750 సీట్లు సమకూర్చాల్సి ఉన్నా, చంద్రబాబు ప్రభుత్వ కక్షపూరిత విధానాలతో, 700 సీట్లు కోల్పోయాం అన్నారు. ప్రభుత్వం తక్షణమే పిపిపి నిర్ణయానికి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందించారు.

ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పూర్తిచేసి నిర్వహించాలని డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి, నార్పల సత్యనారాయణ, పట్టణ వైసీపీ అధ్యక్షులు కోటి రెడ్డి బాలిరెడ్డి, చందమూరు నారాయణ రెడ్డి, గడ్డం కుళ్లాయప్ప, కుమార్ పాల్గొన్నారు.

హిందూపురంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కాగా ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. అయినా వైసిపి శ్రేణులు ర్యాలీని కొనసాగించారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం తీసుకునేందుకు అధికారులు ఎవరూ లేకపోవడంతో ప్రధాన రహదారిలో బైటాయించి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ హారతి నిరసన కార్యక్రమం వద్దకు చేరుకుని వినతి పత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని మడకశిరలో నిర్వహించారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కుంచిటి విభాగం అధ్యక్షులు రంగే గౌడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి, నాయకులు ఆనంద రంగారెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

హిందూపురంలో..

మడకశిరలో..

పిపిపితోనే మెడికల్ కాలేజీల నిర్మాణం

ఉనికి కోసం జగన్ అండ్ బ్యాచ్ డ్రామాలు : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

మెడికల్ కాలేజీల నిర్మాణంపై ఉనికి కోసం వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ పీపీపీ మోడల్‌తో మెడికల్ కాలేజీలు నిర్మించి తీరుతామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. కల్తీ మద్యం తయారీలో అన్ని వేళ్లూ తాడేపల్లి ప్యాలెస్ వైపు చూపిస్తున్నాయని, కల్తీ నెయ్యి ఘటనలో అన్ని కళ్లూ ఆ ప్యాలెస్ వైపే చూస్తున్నాయన్నారు. పట్టణంలో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అనంతరం విలేకరులతో మాట్లాడారు. 17 మెడికల్ కాలేజీల నిర్మాణమంటూ అట్టహాసంగా భూమి పూజ చేసిన జగన్ వాటిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. రాజధాని అమరావతిని, పోలవరాన్ని, బీసీ గురుకులాలను, టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోకుండా జగన్మోహన్‌రెడ్డి పాలన చేశారన్నారు. ప్రచార ఆర్భాటం కోసం 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నామంటూ ఓ బూటకపు భూమి పూజ చేశాడని జగన్‌పై మంత్రి మండిపడ్డారు. రాజకీయ ఉనికి కోసం మెడికల్ కాలేజీలపై వైసిపి రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. మెడికల్ కాలేజీలకు భూమి పూజ చేసిన వ్యక్తి, వాటి నిర్మాణాలను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు నేతత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. జగన్ హయాంలో భూమి పూజ చేసిన వదిలేసిన మూడు లక్షల ఇళ్లను పూర్తి చేసి, పేదోడి సొంతింటి కలను సీఎం చంద్రబాబు నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో మొదటి విడతలో పది మెడికల్ కాలేజీలను పీపీపీ మోడల్‌లో నిర్మించి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న సవిత

ఉపాధి బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి-లేపాక్షి

మండల వ్యాప్తంగా గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు పెండింగ్ బిల్లులు మంజూరు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కూలీలతో కలిసి ఏపీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు దాదాపు 12 వారాల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. బిల్లులు చెల్లించకపోగా కూలీలకు ఉపాధి పనులు కూడా కల్పించలేదన్నారు. అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయడంతో పాటు కూలీలందరికీ ఉపాది పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కృష్ణ మూర్తి, ప్రేమక్క, చంద్రకళ, లింగమ్మ, మమత పాల్గొన్నారు.

నేడు గుడిబండలో వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-గుడిబండ

మండల కేంద్రమైన గుడిబండలో గురువారం ఉదయం 10 గంటలకు వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరగనుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి తెలిపారు. సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ శివకుమార్ ఇంట్లో బుధవారం నాడు వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో పాటు హిందూపురం ఎంపీ బీకే పార్థ సారథి, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హాజరవుతున్నారని చెప్పారు. మడకశిర నియోజకవర్గంలోని వాల్మీకులు అందరూ ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

13లోగా పనులు పూర్తి చేయండి

కలెక్టర్, ఎస్పీ ఆదేశం- సత్యసాయి జయంతి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్, పుట్టపర్తి అర్బన్

సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన ఈ నెల 13వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌లు ఆదేశించారు. అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును బుధవారం నాడు కలెక్టర్, ఎస్పీలు బుల్లెట్ ద్విచక్రవాహనంపై తిరుగుతూ పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా వాహనం నడపగా ఎస్పీ వెనుక కూర్చొన్ని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పెట్రోల్ బంక్ వద్ద నుంచి మొదలుపెట్టి, పెరేడ్ గ్రౌండ్ దారిలో ఎడమవైపు పార్కింగ్ ఏరియా, పోలీస్ పరేడ్ గ్రౌండ్, వెస్ట్ గేట్ వద్ద చింత తోపు, చిన్నపల్లి స్కూల్ వద్ద పార్కింగ్ ఏరియాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలను కలెక్టర్, ఎస్పీలు చర్చించారు. పార్కింగ్ ఏరియాల్లో మరుగు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్ ఏర్పాట్లను 13వ తేదీలోగా పూర్తి చేయించాలని మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ పంచాయతీ శాఖల అధికారులను ఆదేశించారు. డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసి పారిశుధ్యాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ఎయిర్ పోర్టు, హెలిపాడ్, రైల్వే స్టేషన్, కర్ణాటక నాగేపల్లి నుంచి పుట్టపర్తి వచ్చే రోడ్డు, ఎయిర్ పోర్ట్ నుంచి గణేష్ సర్కిల్ వరకు రోడ్డు పక్కన జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. చిత్రావతి నది ఆవలి వైపు చదును చేసి, గ్రావెల్ వేసి అభివృద్ధి చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాలు బయట ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను ఎక్కడెక్కడ పార్కింగ్ ఏరియాలలో ఉంచాలో తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భోజనం, తాగునీటికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. అనంతరం హిల్‌వ్యూ స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలించి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, మహేష్, ఆర్డీవో కరుణసాగర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, పబ్లిక్ హెల్త్ డిఈ నరసింహ, డిపిఒ సమత, తహశీల్దార్ కళ్యాణ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

బుల్లెట్‌పై తిరుగుతూ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పోలీసుల విస్తత తనిఖీలు

పుట్టపర్తిలో జరగనున్న సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా కట్టుదిట్టమైన బందోబస్తులో భాగంగా పుట్టపర్తి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో పోలీసులు బుధవారం నాడు విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. విదేశీయులు, కాశ్మీరీలు ఉన్న ప్రాంతాలు, అపార్ట్మెంట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనధికార వ్యక్తులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వారి గురించి ఆరా తీశారు. అనుమానిత వ్యక్తుల గురించి సమాచారం ఇవ్వాలని స్థానికులకు తెలియజేశారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం సత్యసాయి నగర్‌కు చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధతాళలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు సత్యసాయి నగర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్(30) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు అధికం అయ్యి వాటిని తీర్చలేక బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రెడ్డప్ప తెలిపారు.

రైలు ఢీకొని యువకుడు..

ప్రజాశక్తి-సోమందేపల్లి.

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో రైల్వే ట్రాక్‌పై బుధవారం ఉదయం ఓ యువకుడు రైలు కిందపడి మరణించాడు. స్థానికులు, రైల్వే పోలీసుల వివరాల మేరకు చాకలి ఆదినారాయణ కుమారుడు చాకలి బాబు(21) పట్టుచీరల సిల్క్‌హౌస్‌లో పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. కొద్దిరోజులుగా ఆరోగ్యం సరిగా లేక మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈ సమయంలో బుధవారం ఉదయం బ్రాహ్మణపల్లి రైల్వే ట్రాక్ పై నడుస్తుండగా హైదరాబాదు నుంచి వస్తున్న ట్రైన్ ఢీ కొట్టడంతో మరణించాడు.

'సోలార్' దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి-నంబుల పూలకుంట

మండల పరిధిలోని సోలార్ పరిశ్రమ కంపెనీలో గత ఆరు నెలల క్రితం కాపర్ వైర్ల దొంగతనం చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కదిరి డీఎస్పీ శివ నారాయణ స్వామి బుధవారం ఎన్పీ.కుంట పోలీసు స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. గత ఆరు నెలల నుంచి సోలార్ కంపెనీలో 62వేల మీటర్లు, 92 కేజీల కాపర్ వైర్‌ను దొంగలించారు. దీని విలువ సుమారు రూ.33 లక్షలు ఉంటుంది. కంపెనీ ప్రతినిధులు దీనిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం నాడు పెడబల్లి కొత్తపల్లి వద్ద నిందితులు పటాన్ బాబాఫకృద్దీన్, ఆవుల రవి షేక్ అలీలను అరెస్టు చేశారు. ఈ చోరీలో ప్రమేయం ఉన్న మరో ముగ్గురు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. వారి నుంచి కాపర్‌వైర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ నాగేంద్ర, ఎస్ఐ వలీబాషా, ఎఎస్ఐ కిషోర్ రెడ్డి, నాగరాజు, విమల కుమార్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పెనుకొండ

పెళ్లయి ఆరు నెలలకే అదనపు కట్నంకోసం అత్తింటి వేధింపులు అధికం కావడం, భర్త మరో పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నం చేస్తుండడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం పెనుకొండలో చోటుచేసుకుంది. బాధితురాలు తల్లిదండ్రులు అందించిన వివరాల మేరకు పట్టణానికి చెందిన నాగేశ్వరరావు, భారతిల కుమార్తె హరికను కడపజిల్లా దువ్వూరుకు చెందిన కృష్ణయ్య, రామసుబ్బమ్మల కుమారుడు రాజేష్‌కు ఇచ్చి గతేడాది అక్టోబర్‌లో వివాహం చేశారు. పెళ్లి సమయంలో 20 తులాల బంగారం, నగదు కట్నంగా ఇచ్చారు. కొన్ని నెలలు కాపురం సజావుగా సాగింది. తర్వాత అత్త,మామ, భర్త, బావలు అదనపు కట్నం కోసం వేధింపులు గురి చేవారు. 6నెలల క్రితం తన వద్ద ఉన్న బంగారం తీసుకుని ఇంటి నుంచి బయటకు పంపేశారు. అనంతరం తల్లిదండ్రులు, పెద్ద మనుషుల పలుమార్లు పంచాయతీ చేసిన స్పందించలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది పుట్టినింట్లో నిద్ర మాత్రలు మింగి హారిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

అర్హత లేకున్నా హైస్కూల్‌కు అనుమతి

ఫిర్యాదులు రావడంతో అనుమతులకు బ్రేక్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలో విద్యా వ్యవస్థలో పారదర్శకత ప్రశ్నార్థకంగా మారింది. కనీస అర్హతలు లేని ఒక ప్రయివేటు పాఠశాలకు హైస్కూల్ అనుమతి ఇవ్వడం పెద్ద వివాదానికి దారితీసింది. ప్రభుత్వ పాఠశాలకి పక్కనే ఉన్న ఈ ప్రయివేటు పాఠశాల 7వ తరగతి నిర్వహణకు కూడా సౌకర్యాలు లేవనే విమర్శలు ఉన్నాయి. అయినా పాఠశాల నిర్వాహకులు రాజకీయ మద్దతుతో 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించేందుకు అనుమతులు తెచ్చుకున్నారు. వసతులు లేని ఈ ప్రయివేటు పాఠశాలకు హైస్కూల్ నిర్వహణకు కావాల్సిన ఎన్‌ఓసిని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇచ్చారు. ఆ ప్రయివేటు పాఠశాలలో 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలూ, అర్హతలు ఉన్నాయని అంగీకరిస్తూ శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నంత ప్రధానోపాధ్యాయురాలు అనుమతి ఇవ్వడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. అనుమతి విషయం ఆ నోటా ఈ నోటా బయటకు పొక్కడంతో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తను చేసింది తప్పు అంటూ ఆ ఎన్‌ఓసిని వెనక్కి తీసుకున్నారు. ప్రయివేట్ పాఠశాల యజమాని తనను సంప్రదించినప్పుడు ఎన్‌ఓసి ఇవ్వడం కుదరదని డివైఈఓ దగ్గరకు వెళ్లాలని సూచించానని, ఇంతలోనే మండల విద్యాశాఖ అధికారి ఏం పర్లేదు మీరు ఇవ్వండి అని చెప్పడంతో ఎన్‌ఓసిపై సంతకం పెట్టానని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

రీసర్వేతో రైతులకు భూహక్కులు

బత్తలపల్లి : రైతులకు భూములపై హక్కు కల్పించేందుకే ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ డైరెక్టర్ రోనంకి కుర్మానాథ్ తెలిపారు. బుధవారం మండలంలోని ఈదులముష్టురు గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్నిజిల్లా సర్వే అధికారి విజయశాంతి బాయితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించి రైతులకు భూహక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సర్వే అనంతరం ప్రతి రైతు పొలానికి సర్వే నెంబరు ఇస్తామన్నారు. సర్వేపై రైతులకు ఎటువంటి అపోహలు అవసరంలేదని తెలియజేశారు. 58 రోజులు సర్వే జరిగే గ్రామంలోనే సర్వే అధికారులు ఉంటారని, ఏదైనా సమస్యలుంటే వారికి వివరించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, ఉప సర్వే ఇన్స్‌పెక్టర్ మురళికృష్ణ, సర్వే టీజీ పవన్‌కుమార్, మండల సర్వేయర్ జోసిక్, గ్రామ సర్వేయర్లు బాసీం, సోనియారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుడిబండ

గ్రామాల్లో అందరూ ఐకమత్యంతో కలిసి గ్రామాల అభివృద్ధికి కషి చేయాలని, రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రతి గ్రామంలోనూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచులు టిడిపి మద్దతుదారులు గెలిచేలా సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు పిలుపునిచ్చారు. బుధవారం మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కడికేర పంచాయతీ టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరికేర పంచాయతీలోని ఒక గ్రామానికి 5 లక్షల రూపాయలు సిసి రోడ్ల నిర్మాణం, 40 లక్షల రూపాయలు తాగునీటి కోసం మంజూరు చేశామన్నారు. వైసిపి పాలనలో జరగని అభివృద్ధి, కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర ఒక్కలిగల కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, గుడిబండ మండలం టిడిపి కన్వీనర్, లక్ష్మి నరసప్ప, సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, మైనారిటీ సెల్ అధ్యక్షులు, షబ్బీర్, టిడిపి నాయకులు నాగభూషణం, చంద్రప్ప, నాగరాజు, మాజీ సర్పంచి తిప్పేస్వామి, శివన్న పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఫీజు చెల్లించండి : డిఇఒ

ప్రజాశక్తి-కొత్తచెరువు

2026 మార్చి నెలలో జరగబోయే పదవ తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు, గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్ష ఫీజును నవంబర్ 13వ తేదీ నుండి 25వ తేదీ లోపు చెల్లించాలని డీఈవో కష్టప్ప తెలిపారు. 50 రూపాయల అపరాధ రుసుముతో ఈనెల 26 నుండి డిసెంబర్ 3 తేదీ లోపు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబర్ 4 నుంచి 10 తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 11 నుంచి 15వ తేదీ లోపు ఆయా పాఠశాలల్లో చెల్లించాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిసి 125 రూపాయలు, ఒకేషనల్ విద్యార్థులకు 125 రూపాయలతో పాటు 60 రూపాయలు అదనంగా చెల్లించాలన్నారు.

మంగళమడకలో పోలీసులు తనిఖీలు

ముదిగుబ్బ : మండల పరిధిలోని మంగళమడక గ్రామం కార్డెన్ సెర్చ్‌లో భాగంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ముదిగుబ్బ రూరల్ సిఐ .శ్యామ రావు సిబ్బందితో కలిసి బుధవారం తెల్లవారు జామున పలు నివాసాల్లో తనిఖీలు చేశారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ప్రజలు ఘర్షణల జోలికి వెళ్లోద్దన్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ సమస్యపై అధికారులకు వినతి

రొద్దం : పాత నెంబర్‌కు లెటర్ మార్చి ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్న భూ సమస్యపై అధికారులకు బాధితుడు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పాతర్లపల్లి వద్ద పొలం సర్వే నెంబర్‌కు లెటర్ చేర్చి కొంతమంది ఆన్లైన్లో ఎక్కించుకున్నారని గోవిందు రికార్డ్ అసిస్టెంట్‌కు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2003లో ప్రభుత్వం మండలంలోని పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో పాతర్లపల్లి వద్ద సర్వే నంబర్ 250-6లో 3ఎకరాలు భూమి తనకు ఇచ్చిందన్నారు. కొంతమంది 250-6 బి గా ఆన్‌లైన్‌లో మార్చి తన భూమిని మార్చుకున్నారన్నారు. అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మీసేవ కేంద్రం తనిఖీ

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని తహశీల్దార్ దేవేందర్ నాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ కేంద్రంలో అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. అధిక ధరలు తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయితీతో ఉలవలు అందిస్తాం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండలం వసంతపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం మండల వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారి ముస్తఫా మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో ఉలవలను అందిస్తోందని, ఇందుకోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వేరుశనగ పంటలో తప్పనిసరిగా ఎకరాకు 200 కేజీల జిప్సం వేసుకోవాలని తెలియజేశారు. ధర్మవరం మండలానికి 300 క్వింటాళ్ల ఉలవలు కేటాయించామన్నారు.

రైతు సంక్షేమ పథకాలపై అవగాహన

బుక్కపట్నం : మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వ్యవసాయ అధికారులు తెలియజేశారు. సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విలేకరులపై దాడులు దుర్మార్గం

ప్రజాశక్తి-తలుపుల

వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

వాస్తవాలను వార్తల ద్వారా ప్రజలకు తెలియజేసిన చిలమత్తూరు ప్రజాశక్తి విలేకరి శంకరప్పపై అధికార పార్టీ నాయకుల దాడి దుర్మార్గమని మండల విలేకరులు తెలియజేశారు. దాడిని నిరసిస్తూ, నిందితులను అరెస్టు చేయాలని కోరుతూ బుధవారం నాడు ఎఎస్ఐ గురప్పకు వినతిపత్రం అందజేశారుతక్షణం దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం నాయకులు నాగరాజు యాదవ్, హరీష్‌ను అరెస్టు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవలని కోరారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు వేంపల్లి బాదుల్లా, రఘునాథరెడ్డి, ఇమామ్ బాషా, రవి పండిట్, అల్లా బక్షు, షామీర్, మదన్ మోహన్ పాల్గొన్నారు.

18న జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం, ఆత్మ గౌరవం కల్పించేలా జనగణలో కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, చేతి వత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధుతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగరాజు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్



సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నాగరాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ హమాలీలను ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీ వేతనాలు చెల్లించాలని కోరారు. సరుకు లోడింగ్, అన్లోడింగ్ హమాలీలపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. 12 రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. మృతి చెందిన హమాలీ కార్మికుల కుటుంబాలకు రావాల్సిన నష్టపరిహారం, బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.